క్లుప్తంగా

జీఓ 117ను రద్దు చేయాలి


మాట్లాడుతున్న ఆపస్ ప్రధాన కార్యదర్శి రాజు

రణస్థలం: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జీఓ 117ను రద్దు చేస్తామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బహిరంగ లేఖ రాసి హామీ ఇచ్చారని, ఆయన ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆపస్ మండల ప్రధాన కార్యదర్శి సింగూరు రాజు అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో మండల ఏపీయూఎస్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ జీఓ 117ను రద్దు చేసి ఉద్యోగోన్నతులు చేపట్టిన తర్వాత పని సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సభ్యులు కె.లింగరాజు, ఎం.రవిభట్లు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

రణస్థలం: గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. ఎన్హెచ్-16 నుంచి తహసీల్దార్ కార్యాలయం మీదుగా వెళ్లే రహదారి నిర్మాణానికి రూ.33.70 లక్షల ఉపాధి నిధులు మంజూరయ్యాయన్నారు. బుధవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జేఈ కూర్మనాథం, మాజీ ఎంపీపీ డీజీఎం ఆనందరావు, కుటమి నాయకులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పనుల పరిశీలన

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామంలో చేపడుతున్న జల్ జీవన్ మిషన్ పనులను ఆర్ డబ్ల్యూఎస్ ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి బుధవారం పరిశీలించారు. జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పైపులైన్ పనులు శరవేగంగా చేస్తున్నామన్నారు. స్థానిక నాయకుడు పున్నాన అక్కలనాయుడు ఉన్నారు.

గుండెపోటుతో హాస్టల్ వార్డెన్ మృతి


సత్యన్నారాయణ (ఫైల్)

గార: అంపోలు బీసీ వసతి గృహం సంక్షేమాధికారి పి.సత్యన్నారాయణ సోమవారం సాయంత్రం గుండెపోటుతో మరణించారు. శ్రీకాకుళం పీఎన్ కాలనీలో నివసిస్తున్న ఆయన సోమవారం ఉదయం అనారోగ్యానికి గురికావడంతో నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఇటీవలే గ్రేడ్-1గా పదోన్నతి పొందిన సత్యన్నారాయణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈయన మృతిపై జిల్లా బీసీ సంక్షేమాధికారి అనూరాధ, సహాయ సంక్షేమ అధికారి ఎల్.అప్పారావు, బీసీ వెల్ఫేర్ అధికారులు సంతాపం తెలియజేశారు.

ఇప్పిలిలో విద్యుత్‌లైన్ల మరమ్మతులు

శ్రీకాకుళం రూరల్: ఇప్పిలి గ్రామంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు రెండు రోజులుగా జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో విద్యుత్ సమస్యలు ఎక్కువ కావడంతో గ్రామస్తుల ఫిర్యాదులు మేరకు సంబంధిత శాఖాధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం ఉన్న సింగిల్ ఫేస్‌ను తొలగించి హైకెపాసిటీ విద్యుత్ వైర్లను వేస్తున్నారు.

పోలీస్ పరేడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలవాలి


కవాతు పరిశీలనలో ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో గురువారం జరగనున్న స్వాతంత్య్ర వేడుకల్లో పోలీస్ పెరేడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సాయుధ బలగాలకు సూచించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్, బ్యాండ్ పోలీసు సిబ్బంది స్కౌట్ విద్యార్థులతో బుధవారం చేసిన పరేడ్ సాధనను బుధవారం ఎస్పీ పర్యవేక్షించారు. ఇందులో భాగంగా ముందుగా సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించి జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కవాతు పరిశీలన వాహనంలోవెళ్లి పరేడ్ పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. మైదానంలో వాహనాల పార్కింగ్, ట్రాఫిక్, భద్రతా బందోబస్తుపై అధికారులతో చర్చించారు. సాధనలో అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్, డీఎస్పీ శేషాద్రినాయుడు, ఆర్ఐ కె.నర్సింగరావు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వెల్లివిరిసిన సాంస్కృతిక చైతన్యం

శ్రీకాకుళం కల్చరల్:

శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో సీఐటీయూ, గరిమెళ్ల విజ్ఞాన వేదిక, ప్రజాసంఘాల సంయుక్త నిర్వహణలో బుధవారం 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల వినోద, విజ్ఞాన సృజనాత్మక సాంస్కృతిక చైతన్యం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ఆశావర్కర్స్ యూనియన్ కోలాట ప్రదర్శన, ఎస్ఎఫ్ఐ విద్యార్థుల ఆధ్వర్యంలో దేశభక్తిపై గీతాలు, ఉమామహేశ్వరరావుచే మ్యాజిక్ షో, మధ్యాహ్న భోజన పథకం కార్మికులచే నృత్య కార్యక్రమం, వెలుగు సంస్థ ఆధ్వర్యంలో డ్యాన్సు, అంగన్‌వాడీ యూనియన్‌చే నృత్యాలు, చిన్నారులచే వెస్ట్రన్ డ్యాన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎం.వి.కామేశ్వరరావు వ్యాఖ్యాతగా జరిగిన ఈ కార్యక్రమంలో వి.జి.కె.మూర్తి, కొత్తకోట అప్పారావు, సూరయ్య, ఆదినారాయణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.తేజేశ్వరరావు, సీఐటీయూ మహిళా విభాగం ప్రతినిధులు నాగమణి, కేతవరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.


శ్రీకాకుళంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పోలీసులు


గీతాలు ఆలపిస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు


గీతాలను ఆలపిస్తున్న చిన్నారులు


ఆశవర్కర్ల కోలాట ప్రదర్శన

పుస్తక ప్రదర్శన

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 78వ భారత స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సమరయోధుల జీవిత చరిత్రల పుస్తకాలను బుధవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రికుమార్ రాజు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్య్రం కోసం ఎందరో త్యాగధనులు ప్రాణాలను అర్పించారన్నారు. అటువంటి వారి జీవిత చరిత్రలను భావితరాలవారు చదివి తెలుసుకుని స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు. డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి.భాస్కరరాజా, పాఠకులు పాల్గొన్నారు.


పుస్తకాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్యకు మంచి అవకాశాలు ఉన్నాయని శ్రీశివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ యండ శ్రీనివాసరావు అన్నారు. చిలకపాలెంలో శ్రీశివానీలో బుధవారం లియో గ్లోబల్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్య చదివితే అక్కడి చట్టాల మేరకు మెరుగైన వేతనాలు లభిస్తాయన్నారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలు, ప్రవేశపరీక్షలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇంజినీరింగ్, ఫార్మసీ విద్యార్థులకు ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లియో గ్లోబర్ సర్వీసెస్ ప్రతినిధులు కోనా కోమలి, సతీష్, రాజేందర్, అన్ని విభాగాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

క్యాన్సర్ నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి

అరసవల్లి: క్యాన్సర్ వ్యాధిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఇంటింటి సర్వే చేపడుతోందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ప్రభుత్వ లక్ష్య సాధనకు ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్స్ (పీఎంపీ) భాగస్వామ్యం ఎంతైనా అవసరమని అన్నారు. స్థానిక ఏడు రోడ్ల కూడలిలో కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ సంఘాలతో జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన క్యాన్సర్‌పై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధిని తొలి దశలో గుర్తిస్తే కచ్చితంగా ప్రాణాపాయం నుంచి రక్షించే అవకాశాలుంటాయని, దురదృష్టకరంగా చాలా సందర్భాల్లో నాలుగో దశలో గుర్తిస్తుండడంతో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందన్నారు. క్యాన్సర్‌పై చేపడుతున్న ఇంటింటి సర్వేకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వండాన శిమ్మన్న, కార్యదర్శి నక్క లక్ష్మీనారాయణ, కోశాధికారి కె.జనార్దన, జెమ్స్ వైద్యులు బమ్మిడి సందీప్, ఎం.వెంకటరమణ, నందన రవీంద్ర ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

స్వచ్ఛంద సంస్థ ఔదార్యం

శ్రీకాకుళం కల్చరల్: అనారోగ్యంతో స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భగ్గువానిపేట గ్రామానికి చెందిన కుర్మపు ప్రసాద్‌కు మందుల కోసం సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు రూ. 15 వేలు ఆర్థిక సాయాన్ని బుధవారం చేశారు. ఇంకా ఏమైనా సాయం కావాలంటే తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మధు, అవినాష్, మహాలక్ష్మి, చరణ్, ఉమాశంకర్, రమణ, ఉర్లం శివతేజ ఉన్నారు. అలాగే ఫాజుల్‌బాగ్‌పేటకు చెందిన జి.రాజు, గౌరీల కుమారుడు షణ్ముఖ శ్రీనివాస్ వింత వ్యాధితో బాధపడుతున్నాడు. రెండు కళ్లు, కాళ్లు చచ్చుపడి మంచానికి పరిమితమయ్యాడు. ధర్మవరం గ్రామానికి చెందిన రుప్ప సోమేశ్వరరావు అందించిన సహకారంతో మూడు చక్రాల కుర్చీని స్వచ్ఛందసంస్థ సభ్యులు బాలుడుకి అందజేశారు. ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, కరగాన రాణి ఉన్నారు.


ప్రసాద్‌కు సాయాన్ని అందజేస్తున్న స్వచ్ఛందసంస్థ సభ్యులు

మెట్టవలసలో కొనసాగుతున్న వైద్య శిబిరం

జి.సిగడాం: మండలంలోని మెట్టవలస గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతుంది. డయేరియా అదుపులోకి వచ్చినా.. స్థానిక వైద్యులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబింధు ఆధ్వర్యంలో బుధవారం కూడా వైద్యసేవలు అందించారు. ఇప్పటికే జి.సిగడాం ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలను 5 టీమ్‌లుగా ఏర్పాటు చేశారు. వీరంతా ప్రతి వీధిలో ఉన్న ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. గత నాలుగు రోజుల నుంచి ఒక్క డయేరియా కేసు కూడా నమోదు కాలేదని డాక్టర్ యశ్వంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్ భాస్కరరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


సూచనలిస్తున్న డాక్టర్ యశ్వంత్

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్:

కొత్తపేట గ్రామ ఉన్నత పాఠశాల ఆవరణలో స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా బుధవారం అక్షయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు బొనిగి మధు మాట్లాడుతూ మొక్కలు నాటేందుకు తమ సంస్థ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు బొడ్డేపల్లి సుధాకర్, అన్నెపు శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న సేవా సంస్థ ప్రతినిధులు, గ్రామస్తులు

పేర్లు రిజిస్ట్రేషన్‌కు అవకాశం

ఎచ్చెర్ల క్యాంపస్: దుప్పలవలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ఖాళీ సీట్లలో ప్రవేశానికి గురువారం కూడా పేర్లు రిజిస్ట్రేషన్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల నుంచి వచ్చిన వారి పేర్లు బుధవారం రిజిస్ట్రేషన్ చేశామన్నారు. రిజిస్ట్రేషన్లు పూర్తిచేశాక ఖాళీ సీట్లును రిజర్వేషన్‌ల ప్రాతిపదికన జిల్లా విద్యాశాఖ అనుమతితో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు వాయిదా

అరసవల్లి: అరసవల్లిచ సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియను అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఉదయం జరగాల్సిన ఈ ప్రక్రియను త్వరలో చేపడతామన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

గార: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నియమితులైన సంజీవి రమణయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికలకు విజయనగరం జిల్లాకు బదిలీపై వెళ్లారు. రమణయ్యకు ఏవో శ్రీనివాసరావు, ఉమ, శేఖర్‌లు అభినందనలు తెలియజేశారు.

26న శ్రీకృష్ణ వేషధారణ పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో భాగంగా ఈనెల 26న చిన్నారులకు శ్రీకృష్ణ వేషధారణ పోటీలు జరగనున్నాయి. ఈ విషయాన్ని నిర్వాహకులు అందవరపు మురకయ్య, మిమిక్రీ శ్రీనివాస్, రామారావులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొంతావారి వీధిలో ఉన్న శ్రీకృష్ణార్జున మందిరంలో ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు పోటీలు జరుగుతాయన్నారు. 4 నుంచి 8 ఏళ్ల జూనియర్స్ విభాగంలో, 8 నుంచి 10 ఏళ్లలోపు చిన్నారులు సీనియర్స్ విభాగంలో పోటీలో పాల్గొనాలని కోరారు. కేవలం ప్రతీ విభాగానికి 25 మంది చిన్నారులకు మాత్రమే అవకాశం ఉందన్నార. ఆసక్తి గల తల్లిదండ్రులు తమ పిల్లల పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94410 72762 నంబర్ని సంప్రదించాలన్నారు.

వైద్య విద్యార్థుల నిరసన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం జరిపి హత్య చేసిన ఘటనను నిరసిస్తూ శ్రీకాకుళం రిమ్స్ వైద్య విద్యార్థులు, జూనియర్ వైద్యులు మూడో రోజు బుధవారం కూడా ఆందోళన కొనసాగించారు. రిమ్స్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వైద్య విద్యార్థులకు కేంద్ర రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీబీఐ విచారణ జరిపి నిందితులకు శిక్ష పడే వరకు దేశవ్యాప్తంగా జూనియర్ వైద్యుల సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేవారు. కార్యక్రమంలో డాక్టర్ జి.వెంకటేష్, డాక్టర్ అంబేడ్కర్, డాక్టర్ మోహిత్‌కుమార్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ రాజ్‌కుమార్ తదితరులు ప్రసంగించగా.. పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల బీమా అందజేత

జి.సిగడాం: మండలంలోని బాతువ గ్రామానికి చెందిన బొద్దాన అప్పలరాజు ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. ఆయన భార్య కనకమ్మకు రూ.10 లక్షల చెక్కును పార్వతీపురం పోస్టల్ మేనేజర్ సాగర్, చీపురుపల్లిసబ్ డివిజనల్ పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ జి.అచ్చుతరావు బుధవారం అందించారు. అప్పలరాజు ఏడాదికి రూ.399లతో బీమా చేసుకున్నారన్నారు.

ఆర్‌జీయూకేటీలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్‌లో బుధవారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జెండా ఊపి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలజీ ప్రారంభించారు. విద్యార్థులు దేశ భక్తి నినాదాలు చేశారు. యువతకు దేశ భక్తి, క్రమ శిక్షణ ఉండాలన్నారు. ర్యాలీలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదిరి పాల్గొన్నారు.

లైసెన్స్‌డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్


శ్రీనివాసరావుని సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఆంధ్రప్రదేశ్ లైసెన్స్‌డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన ముని శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఈ మేరకు తిరుపతిలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసీ మెంబర్‌గా బూర్లె సత్యనారాయణ ఎన్నికయ్యారని పేర్కొన్నారు. వీరి ఎన్నిక పట్ల పలువురు ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, వివిధ సంఘాల నేతలు అభినందనలు తెలిపారు.

హయాతీనగరం గురుకులం విద్యార్థినుల ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం హయాతీనగరంలోని మహాత్మజ్యోతిబా పూలే ఏపీ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 80 అడుగుల రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన వివిధ పోటీల్లో గురుకులానికి చెందిన పలువురు విద్యార్థినులు ప్రతిభ కనబర్చి పతకాలు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. సీనియర్ విభాగంలో పదో తరగతికి చెందిన ఎం.పూజ వక్తృత్వంలో ద్వితీయ స్థానం, జి.జాహ్నవి వక్తృత్వంలో తృతీయ స్థానం, జూనియర్ విభాగంలో ఏడో తరగతికి చెందిన వి.ఢిల్లేశ్వరి వక్తృత్వంలో తృతీయ స్థానాల్లో నిలిచారనిపాఠశాల ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి బుధవారం తెలిపారు. బహుమతులు అందుకున్న విద్యార్థినులు ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయినులు అభినందించారు.


బహుమతులు అందుకున్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి

హడావుడి పనులు!


వర్షంలో ఫుట్‌పాత్‌కు పెయింటింగ్ వేస్తున్న దృశ్యం


ఆర్ట్స్‌కాలేజీ రోడ్డులో ఎస్పీ కార్యాలయం గోడకు పెయింటింగ్ వేస్తున్న దృశ్యం

- వర్షం పెయింటింగ్ పనులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పద్ధతి ప్రకారం ప్రతీ పనికి టెండర్లు ముందస్తుగా పిలిచి పనులు నిర్వహించేవారు. ఇప్పుడు అవేమి కానరావడం లేదు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏటా స్వాతంత్య్ర వేడుకలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ మైదానాన్ని శుభ్రం చేయడం, ఆ రోడ్డులో చిన్న చిన్న రిపేర్లు చేయడం, ఫుట్‌పాత్‌లకు రంగులు వేయడం, గోడలకు మ్యూరల్ పెయింట్స్ వేయడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది ఎలాంటి టెండర్లు పిలవకుండానే హడావుడిగా రెండు రోజులు ముందు పనులు ప్రారంభించి తూతూ మంత్రంగా ముగించేసి లక్షలాది రూపాయలను కాంట్రాక్టులు, మున్సిపల్ ఇంజినీర్లు వాటాలు వేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్షంలో రంగులు వేసే పనులు చేస్తున్నారు. దీంతో కొద్దిసేపటికే రంగులు నీటిలో కలిసిపోతున్నాయి.